

# రట్టు కాని గుట్టు

## చిన్నారి పాఠకులకు ప్రకృతి కథలు

విద్యా, రాజారాం శర్మ

అనువాదం : కె. సురేష్

## ఇతర కథలు:

గూళ్లు కట్టేవి, ఆక్రమించేవి

గుజ్జన గూళ్లు

గుడ్ల రహస్యం

రకరకాల పక్షులు

రెండు పిట్టలు అరగంట పైనుంచి కష్టపడుతున్నాయి. కుళ్లిన మొక్కలను అవి గుట్టగా పేరుస్తున్నాయి. ఈ చిన్న పిట్టలు గజ ఈతగాళ్లు. నీటిలోకి మునక వేస్తే మళ్లీ ఎక్కడ పైకి వస్తాయొ చెప్పటం చాలా కష్టం. నీటిలో మునిగిన ప్రతిసారీ వాటికి ఒక మొక్కో, ఆకో దొరుకుతోంది!

ఈదుకుంటూ వెళ్లి కుప్పమీదకి వేస్తున్నాయి.





మధ్యమధ్యలో ఒక పిట్ట ఆ కుప్పమీదకి ఎక్కేది. కుప్ప అంతా మెల్లగా కుదుపుకి లోనయ్యేది! ఆ కుప్ప దేనిమీదనైనా ఉందా, లేక నీటిలో తేలుతోందా?

నా కుతూహలాన్ని ఇంక ఏమాత్రం అణుచుకోలేకపోయాను. “ఏం చేస్తున్నావు? విశ్రాంతికి ఒక దీవిని చేస్తున్నావా?”

“నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు?” గదమాయించి అడిగింది గోధుమ, తెలుపు–నలుపుల్లో ఉన్న ఒక పిట్ట.

“నువ్వు ఎవరివి?” నేను ఆశ్చర్యంగా అడిగాను.

“నేను కూకుడు పిట్టని. నేను ఈ ప్రాంతంలో ఉంటాను. పక్షులం మా పని మేం చేసుకుంటూ, మా మానాన మేం ఉంటాం.”

నేను కూడా నా పని నేను చూసుకోవాలని కూకుడు పిట్ట ఉద్దేశమేమో. కానీ నీటిలోని ఆ పిట్టలు ఏం చేస్తున్నాయో తెలుసుకోకుండా ఎలా వెళ్లిపోవటం?

నేను అక్కడే తచ్చట్లాడుతూ ఉండటంతో విసుగు చెందిన కూకుడు పిట్ట ఎగిరిపోయింది. ఏం జరుగుతోందో తెలుసుకోవాలన్న కృతనిశ్చయంతో చెరువు కట్ట మీద ఉన్న రేల చెట్టు కింద సౌకర్యంగా ఉండేలా కుర్చున్నాను.





రేలచెట్టు పూతలో ఉంది. గుత్తులుగా వేలాడుతున్న పూల అందాన్ని చూడటానికి తల ఎత్తాను. నోట్లో ఏదో పెట్టుకుని ఉన్న చిన్న పిట్ట ఒకటి కనపడింది.

“ఆ పిట్ట గూడు కడుతున్నట్టు ఉంది. ఎక్కడ కడుతోందో,” ఆ పిట్టని చూపులతో అనుసరిస్తూ పైకి అన్నాను. ఆ పిట్ట జాడ తప్పింది కానీ నావైపే తేరిపారచూస్తున్న కూకుడు పిట్ట కనిపించింది.

“అయితే, నా మీద ఒక కన్నువేసి ఉంచావన్నమాట.”

“అవును,” చెప్పింది కూకుడు పిట్ట. “మా ఊసులు పట్టించుకునే వాళ్లంటే మాకిష్టం ఉండదని గుర్తుంచుకో.”

“ఆ చిన్న పిట్ట ఏమిటో నీకు తెలుసా?”

బదులివ్వటానికి చాలా సమయం తీసుకుంది కూకుడు పిట్ట. “దర్జీ పిట్ట. నీటిలో ఉన్నదాని పేరు మునుగుడు కోడి.”

“దర్జీ పిట్టా! ఎంత ముద్దుగా ఉంది. అవి ఆకులను కలిపి కుట్టి గూడు కడతాయి కదూ! అది కూడా గూడు కడుతూ ఉండాలి. ఎక్కడ కడుతోంది?” ఉత్సాహంగా అడిగాను.

“దర్జీ పిట్టల గురించి నీకు చాలా తెలిసినట్టుందే. వాటి గూడు ఎక్కడుంటుందో కూడా తెలియాలి మరి!”





మా పుస్తకంలో దర్జీ పిట్ట గూడు బొమ్మను చూశారు. రెండు–మూడు ఆకుల్ని కలిపి కుట్టి శంఖు ఆకారంలో గూడు కడతాయి. దాని గూటికోసం తోట అంతా కలియచూశాను. శిస్పూ చెట్టు ఆకులు చిన్నగా ఉంటాయి కాబట్టి దాంట్లో గూడు ఉండే అవకాశం లేదు. ఆ పక్కన ఉన్న చెట్టు కూడా అంతే. పొదలు, తీగల్లో కూడా వెతకాలా? వాటిలో కొన్నింటికి పెద్ద ఆకులే ఉన్నాయి.

"కూకుడు పిట్ట అయ్యగారూ! నాకు సహాయం చెయ్యరా?" నేను అడిగాను.

"నేను అయ్యగారిని కాదు. అక్కడ ఉన్న పసిరిక పిట్ట కనపడుతోందా? ఆడా, మగ పసిరిక పిట్టల మాదిరిగానే మాలోనూ ఆడా, మగ పిట్టలు

ఒకేలాగా ఉంటాయి. కానీ పిచ్చుకలు, తేనెపిట్టలలో ఆడా, మగా తేడాగా ఉంటాయి. ఇతర పిట్టలలో..."

"సరే, సరే, కూకుడు పిట్ట అమ్మగారూ! దర్జీ పిట్ట గురించి కొంచెం చెప్పండి."

"వాటిల్లో కూడా ఆడా, మగా తేడాగా ఉంటాయి. గూడు కట్టే సమయంలో మగ దర్జీ పిట్ట తోక బారుగా ఉంటుంది."

"తల్లీ, అది కాదు నేను అడిగింది. దాని గూడు ఎక్కడ ఉంది?" అసహనంగా ప్రశ్నించాను.





కానీ కూకుడు పిట్ట ఏం చెప్పకుండా గమ్మున ఉండిపోయింది. ఏం అర్థంకాక దాన్నే చూస్తున్న నాకు చెత్తకుండీలోకి వెళుతున్న ఒక చిన్న పిట్ట కనపడింది! అది అక్కడ ఏం చేస్తోంది? సంగతి ఏమిటో తెలుసుకోవాలి.

"గుడ్లు! గూడు!"

"అరవొద్దు," మందలించింది కూకుడు పిట్ట. "అది మాగ్‌పై రాబిన్ గూడు. గొడవ చెయ్యకుండా ఇవతలికి రా. మాగ్‌పై రాబిన్ సాధారణంగా చెట్టు తొర్రలో గూడు కడుతుంది, కానీ..."

ఇటువంటి చోటుని ఆ పిట్ట ఎలా ఎంచుకుంది? అక్కడ గూడును చూసి

నేను ఆశ్చర్యపోయాను. అది ఒక పుల్లల కుప్పను పేర్చింది.

“ఆగు... ఆగు! కుప్ప! మునుగుడు కోళ్లు కూడా ఒక కుప్పను పేరుస్తున్నాయి. అవి కూడా గూడు కడుతున్నాయా?”

“అవును...” బదులివ్వటానికి కూకుడు పిట్ట చాలా సమయం తీసుకుంది.

నేను చెరువు వైపుకి తల తిప్పాను. అది పెద్ద చెరువు ఏమీ కాదు. దానిని ఒక మడుగు అనవచ్చేమొ. ఈసారి జాగ్రత్తగా పరిశీలించటంతో నాకు నాలుగు కుప్పలు కనపడ్డాయి. నాలుగు గూళ్లు! నేను కనుగొన్నదానికి నాకు చాలా ఆశ్చర్యం వేసింది.





“ఏయ్! ఆ గూడు తేలుతోందా? అవి గుడ్లు పెట్టాయా? నాకు గుడ్లు ఏమీ కనపడడం లేదు. అవి నీటిలో పాడైపోవా? పాములు, ఇతర పెద్ద పక్షులు వాటిని తినెయ్యవా? దయచేసి నాకు అవన్నీ చెప్పవా!”

కూకుడు పిట్ట ఇబ్బందిగా కదిలింది. నాకు చెప్పాలో, వద్దో తేల్చుకోలేక పోతున్నట్టు ఉంది. చివరికి నావైపు గంభీరంగా చూస్తూ ఇలా చెప్పింది: “గూళ్లు కట్టడం, పిల్లల్ని పెంచటం మాకు చాలా ముఖ్యమైన పని. వాటి కోసం ఎంతో కష్టపడతాం. గూటిని ఏదైనా చూసిందంటే... అది గుడ్లని కానీ, పిల్లల్ని కానీ గుటుక్కుమనే ప్రమాదముంది. మా గూళ్లను సాధ్యమైనంత గుట్టుగా ఉంచుతాం. చాలాసార్లు దీంట్లో మేం విజయం సాధిస్తాం!”

నేను ఆలోచనలో పడ్డాను. కూకుడు పిట్ట తటపటాయింపు ఇప్పుడు నాకు అర్థమయ్యింది. గూళ్లు ఎవ్వరికంటా పడకూడదన్నది దాని ఉద్దేశం. గూళ్ల మీద ఎవరి దృష్టీ పడకుండా జాగ్రత్త పడతానని నేను మాటిచ్చాను. గూళ్లను కదిలించననీ, అమ్మా, నాన్న పిట్టలను బెదరగొట్టనని కూడా మాటిచ్చాను. చాలాసేపు బతిమాలించుకున్న తరవాత  కానీ మునుగుడు కోళ్ల గూటి గురించి కూకుడు పిట్ట చెప్పలేదు.

వాటి గూళ్లు మునిగిపోవు. ఒక చెట్టు మోడు, లేదా నీటిలో మునిగి ఉన్న ఒక మొక్క వంటి ఆధారంపైన అవి గూడు కడతాయి. గూడు తయారయిన తరవాత 3-5 గుడ్లు పెడతాయి. ఆ తరవాత వాటిని కూడా మొక్కలు, ఆకులతో కప్పెడతాయి! అందుకే గుడ్లు ఎవరి కంటా పడవు. తాజాగా పెట్టినప్పుడో, అవి పొదుగుతున్నప్పుడో తప్పించి గుడ్లను





చూడడం సాధ్యం కాదు. గూడు వదిలి మేతకు వెళ్లేటప్పుడు అవి తప్పనిసరిగా గుడ్లను ఆకులతో కప్పి ఉంచుతాయి.

“ఆ చెట్టు పక్కన చాలాసేపు నుంచుని ఉన్నావు. అక్కడ నీకేమీ గూడు కనపడలేదనుకుంటా,” నా మీద నమ్మకం కలగటంతో కూకుడు పిట్ట చివరికి చెప్పింది.

“ఆ టేకు చెట్టా?” అని అడిగి దాని దగ్గరికి తిరిగి వెళ్లాను. చెట్టు మొత్తం జాగ్రత్తగా పరికించి చూశాను. అది చాలా లేత చెట్టు, మరీ అంత ఎత్తు లేదు. ఎంత వెదికినా నాకు గూడు వంటిది ఏదీ కనపడలేదు. పక్షులు కూడా ఏమీ కనపడలేదు.

“ఎక్కడ చూడాలో కూడా నీకు తెలిసినట్లు లేదు. అదిగో మడత పెట్టినట్టు ఉన్న ఆ ఆకుని చూడు,” ఆదేశించింది కూకుడు పిట్ట.

“దర్జీ పిట్ట గూడు!” నేను ఆనందంతో అరిచాను. “అవి మాత్రమే ఆకులను కుట్టి గూళ్లు కట్టుకుంటాయి.”

“కాదు. వార్బలర్ పిట్టలు కూడా అలాగే కడతాయి.”

గూటిని ఆరాధనగా చూస్తూ నేను అక్కడే నిలబడిపోయాను. ఒక్క టేకు ఆకుని మాత్రమే అది ఉపయోగించింది. ఆకు అంచుల్లో బెజ్జాలు, కింది భాగం స్పష్టంగా కనపడుతున్నాయి. అంచులను దగ్గరికి లాగి





దూదిలాంటి దారాన్ని ఉపయోగించి కలిపి కుట్టింది. ఆ గూడు శంఖాకారంలాగా కాకుండా స్తంభాకారంలో ఉంది. దాంట్లో మెత్తటి పీచు, గడ్డి ఉన్నాయి. ఈ అద్భుతమైన గూటిలో మూడు అందమైన చిన్న చిన్న గుడ్లు ఉన్నాయి.

నేను వెనక్కి తిరిగి చూసేసరికి నవ్వుతూ ఉన్న కూకుడు పిట్ట కనిపించింది, “చిన్న పిట్టకి చిన్న గూడు. ఇప్పుడు వెనక్కి వచ్చెయ్యి. ఏ క్షణంలోనైనా తల్లి పిట్టలు రావచ్చు. వాటి గూడు వెల్లడి కావటం వాటికి ఇష్టముండదు.”

నాకు అక్కడినుంచి కదలబుద్ధి కాలేదు.

“ఇటు చూడు,” కూకుడు పిట్ట నా దృష్టిని మళ్లించటానికి ప్రయత్నించింది. “పసిరిక పిట్ట గుర్తుందా? అందంగా ఉండే ఆకుపచ్చ పిట్ట? నాతో రా,” అంటూ చెరువు దక్షిణం వైపుకి నన్ను తీసికెళ్లింది.

మొక్కలు పెట్టడానికి కొన్ని సంవత్సరాల క్రితం గుంతలు తవ్వినట్టు ఉంది. కానీ వాటిని అలాగే వదిలిపెట్టారు.

ఒక గుంతను చూపించి నాకు ఏమి కనిపిస్తోందని అడిగింది కూకుడు పిట్ట.

“ఏం లేదు. గుంత, గుంతకి ఒకవైపున ఒక కన్నం.”





“అది సొరంగం! పసిరిక పిట్ట దానిని రెండు నెలల క్రితం చేసింది.”

“దేని కోసం?” నమ్మశక్యంకాక అడిగాను.

“గూటి కోసం!” మూడు అడుగుల కంటే పెద్ద సొరంగాన్ని పసిరిక పిట్టలు తవ్వి, దాంట్లో గుడ్లు పెడతాయని ఆ తరవాత కూకుడు పిట్ట నాతో చెప్పింది.

“అంత చిన్న పిట్ట, అంత పెద్ద సొరంగం తవ్వగలుగుతుందని ఊహించగలిగావా? లకుముకి పిట్టలు కూడా సొరంగం గూళ్లు కడతాయి. అయితే ఈ రెండు పిట్టల గూళ్లు కట్టేకాలం అయిపోయింది.”

ఎంత అద్భుతం! నేను చాలా పిట్టల్ని చూశాను. కానీ అవి ఎక్కడ, ఎలా గూళ్లు కట్టుకుంటాయెూ నాకు తెలియదు.

కూకుడు పిట్టవైపు తిరిగి ఆసక్తిగా అడిగాను, “మరి నీగూడు సంగతి ఏమిటి? నువ్వు ఎక్కడ, ఎలా గూడు కడతావు?”

అది ఏమీ మాట్లాడకుండా గుడ్లురుముతూ నావైపు చూడసాగింది. అంతకంటే వేరే ఆశించి ఉంటే అది నా తప్పు!

***





## పాత్రలను కలుసుకోండి.

దక్షిణ ఢిల్లీలోని అటవీప్రాంతంలో సంజయ్ వన్‌లో 2010 మే - ఆగస్టు నెలల మధ్య పరిశీలనల ఆధారంగా రాసిన కథ. మునుగుడు కోడి, దర్జీ పిట్టలు గూడుకట్టే కాలం చాలా సుదీర్ఘంగా ఉంటుంది.

పక్షుల, గూళ్ల వాస్తవ పరిణామాన్ని ఈ పుస్తకంలోని ఫోటోలు చూపకపోవచ్చు.



కూకుడు పిట్ట



మునుగుడు కోడి



అమ్మ దర్జీ పిట్ట



గూడు కట్టడానికి దూదితో నాన్న దర్జీ పిట్ట



అమ్మ మాగ్పై రాబిన్



నాన్న మాగ్‌పై రాబిన్



చిన్న పసిరిక పిట్ట

SWORN TO SECRECY published by VIDYA ONLINE is licensed under
a Creative Commons Attribution-NonCommercial-ShareAlike 3.0 Unported License
(http://creativecommons.org/licenses/by-nc-sa/3.0/)
Permissions beyond the scope of this license may be
available at admin@vidyaonline.org

http://vidyaonline.net